# బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నిజాంపేట, ఫిబ్రవరి 9 : మండలంలోని జడ్చెరువు తండాకు చెందిన మలావత్ కల్యాణ్‌కు రూ. 9000, మలావత్ బుజ్జికి రూ. 11,500,రమావత్ అంబికి రూ.14,500 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరైనవి. ఈ మేరకు ఆదివారం స్థానిక నాయకులు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. నాయకులు రాజు, రాజ్య, ధన్‌రాజు, రాజు, రతన్‌సింగ్, బాల్య, మోహన్, లోక్య, రాహుల్ తదితరులు ఉన్నారు.



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చేగుంట, ఫిబ్రవరి 9 : 32 ఏండ్ల కింద ఒకే చోట, ఒకే తరగతిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అప్పటి గురువులు ఒకే చోట కలుసుకొని అపూర్వ సమ్మేళనం జరుపుకొన్నారు. చేగుంట మండలం మక్కరాజిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో1992-93లో చదువుకున్న అప్పట్టి విద్యార్థులంత ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఆదివారం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయం సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్ వారికి వేదికైయింది. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనాలు చేసి, వారిని సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు. అప్పటి హెచ్ఎం ఖయ్యూం, గురువులు ప్రతాప్‌గౌడ్,మురళీదార్, ఫాజిల్, డాక్టర్ సిద్ధిరాములు, పూర్వపు విద్యార్థులు బచ్చు రమేశ్, ఎల్ తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, కొముర‌య్య, వెంకటరామగౌడ్, సీఎచ్ శ్రీనివాస్, డి తిరుపతిరెడ్డి, లక్‌పతి, నర్సింహులు, కవిత, గీతా, కవిత, మంజుల, రాణి, రాజమణి, అనురాధ తదితరులు ఉన్నారు.

## డి.ధర్మారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



డి.ధర్మారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రమాయంపేట, ఫిబ్రవరి 9 : రమాయంపేట మండలం డి.ధర్మారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి 2010-2011 సంవత్సరం విద్యార్థుల బ్యాచ్ ఒక్కటయ్యారు. ఆదివారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులందరూ ఒకే చోటుకు చేరుకుని పాత పరిచయాలను నెమరు వేసుకున్నారు. అనంతరం వారి గురువులకు పాదాభివందనం చేపి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# దుర్గమ్మకు భక్తుల పూజలు





ఏడుపాయల వనదుర్గమాత సన్నిధిలో భక్తులు

పాపన్నపేట, ఫిబ్రవరి 9 : పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గమాత సన్నిధిలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తుల సందడి నెలకొంది. వేకువజాము నుంచే వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కు లు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు రా కుండా ఏడుపాయల ఈవో చంద్రశేఖర్, సంబంధిత సిబ్బంది సూర్యశ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సింహులు, వర్ణాచారి, రాజు తగిన ఏర్పాటుచేయాగా, ఏడుపాయలలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పాపన్నపెట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తగిన బందోబస్తు చేపట్టారు.

# అక్రమ కలప వ్యాపారం

- అటవీ శాఖ అనుమతులు లేకుండా వందల సంఖ్యలో చెట్లు నరికివేత
- మాముళ్ల మత్తులో అటవీ శాఖ అధికారులు
- చిలిపిచెడ్ మండలంలో రాత్రి సమయంలో జోరుగా అక్రమ కలప రవాణా





చిలిపిచెడ్‌లో భారీగా వేప చెట్లు నరికిన వ్యాపారులు

చండూర్ గ్రామ శివారులో కలపను డీసీఎంలో వేస్తున్న కూలీలు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 9 : మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలో జోరుగా అక్రమ కలప వ్యాపారం కొనసాగుతుంది. అటవీ శాఖ నుంచి ఎన్ని చెట్లకు ఏప్రాంతంలో అనుమతులు తీసుకున్నారో ఎవరికి తెలియదు. ఎక్కడ పడితే అక్కడ చెట్లను నరికి వేస్తూ రాత్రి సమయంలో నెంబర్ లేని బోలెరో వ్యాన్‌లో అక్రమ రవాణా చేస్తున్నారు. కలప వ్యాపారుల నుంచి ఆటవీ శాఖ అధికారులకు పెద్ద ఎత్తున మాముళ్లు ముట్టడంతో అక్రమ కలపను తరలిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. నర్సాపూర్ నియోజకర్గంలోని కౌడిపల్లి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్, చండూర్, గౌతాపూర్, సోమక్కపేట, గిరిజన తండాల్లో పగలు చెట్ల నరకడం, రాత్రి వేళల్లో డీసీఎం, బోలెరో వ్యాన్‌ల్లో కలపను తరలిస్తున్నారు. వ్యాపారులు అటవీ శాఖ అధికారుల నుంచి 10 చెట్లకు అనుమతి ఇస్తే వందల చెట్ల నరికివేస్తున్నారు. వ్యాపారులు వాల్టా చట్టం ప్రకారం అధికారుల అనుమతులు తప్పనిసరి కానీ, ఆ నిబంధనలు పక్కన పెట్టి ఇష్టానుసారంగా నరికిన పట్టింపు లేనట్టుంగా అటవీ శాఖ అధికారులు వ్యవహిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వేప, చింత, నీలగిరి చెట్లతో పాటు వివిధ రకాల చెట్లను నరికివేస్తున్నరని స్థానికులు చెబుతున్నారు. మండలంలో అక్రమ కలప వ్యాపారంపై కొందరు రేంజ్, సెక్షన్ అధికారులకు ఫోన్ చేస్తే స్పందించకపోవడం, ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారనే విమర్శలున్నాయి. రైతుల పొలాల్లో పంటలపై నీడపడుతుందని సాకుతో అనుమతులు తీసుకొని అక్రమ వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. అటవీ శాఖ అధికారులు స్పందించి మండలంలో పర్యవరణాన్ని రక్షించేందుకు అక్రమ కలప వ్యాపారం ఆరికట్టాలని ప్రజలు,రైతులు కోరుతున్నారు.

# భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి





ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు, దైవ సందేశం చేస్తున్న ఫాస్టర్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 9 : మెదక్ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులనుద్దేశించి చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్యతో పాటు ఫాస్టర్లు దైవ సందేశం చేసి భక్తులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా భక్తులు యేసయ్యకు మొక్కులు తీర్చుకొని చర్చి ఆవరణలోని చెట్లకింద వంటావార్పు చేసుకున్నారు. ప్రార్థనల్లో భక్తులతో పాటు సీఎస్ఐ కమిటీ సభ్యులు గంట సంపత్, సంశాన్ సందీప్, సువణ్‌డగ్లస్, నోబుల్‌సన్, జాన్సన్ ఫాస్టర్లు డేవిడ్ రిచర్డ్స్, జైపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు



పీఆర్టీయూ పతకాన్ని అవిష్కరించి,ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 9 : పీఆర్టీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని పీఆర్టీయూ భవన్‌లో ఆవిర్భావ వేడుకలు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ వ్యవస్థాపకులు స్వర్గీయ సామల యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. పీఆర్టీయూ నాయకులు సామ్యానాయక్, మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, జనార్దన్, శ్రీనివాస్, నవీన్, సతీశ్ రావు, వీరేందర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట, ఫిబ్రవరి 9 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జిల్లా ఎంపీపీల ఫోరం మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు. ఆదివారం శివ్వంపేట మండలం ఏదుల్లాపూర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. బీసీలను మోసం చేస్తే ఊరుకునేది లేదని, కామారెడ్డి డిక్లరేషన్ ప్ర కారం 42 శాతం రిజర్వేషన్ పక్కా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ సోదరులందరూ కలిసి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడం తథ్యమని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కల్లూరి వెంకటేశ్, లక్ష్మీనర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ పద్మావెంకటేశ్, రాజిపేట వెంకటేశ్, దొడ్లె అశోక్, ముత్యాలు, ముద్దగల్ల రాజు, సుదర్శన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# రోడ్డు పనులు ప్రారంభించక పోతే ధర్నా చేస్తాం



బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని మాట్లాడుతున్న నస్కల్ గ్రామస్తులు

నిజాంపేట, ఫిబ్రవరి 9 : మండలంలోని నస్కల్, నందగోకుల్, రాంపూర్, నగరం గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని నస్కల్ గ్రామస్తులు 15 రోజుల పాటు నిజాంపేట ప్రధాన రోడ్డుపై రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విషయం విదితమే. రోడ్డు నిర్మాణ విషయమై మైనంపల్లి హన్మంతరావుతో మాట్లాడామని,15 రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తామని కాంగ్రెస్ నాయకుడు ముత్యంరెడ్డి,నాయకులు దీక్షలో కుర్చున్న నస్కల్ గ్రామస్తులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన గడువు నేటితో (ఫిబ్రవరి10) పూర్తవుతుండగా కనీసం బీటీ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన ఎటువంటి మెటీరియల్ రాలేదని నస్కల్ గ్రామస్తులు సంజీవ్, లింగం, ఎల్లం, దుర్గయ్య, రఫీక్,మల్లయ్య,రాములు, ఖాసీం, గౌస్, దేవయ్య ఆదివారం తమ బాధను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కనుక నేడు బీటీ రోడ్డు పనులు ప్రారంభించక పోతే మొదటగా కాంగ్రెస్ నాయకుడు ముత్యంరెడ్డి ఇంటి వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి మళ్లీ నిజాంపేట ప్రధాన రోడ్డుపై రిలే నిరాహార దీక్షలను పున:ప్రారంభిస్తామని హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మెదక్‌రూరల్, ఫిబ్రవరి 9 : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన హవేళీఘనపూర్ మండల శివారులోని వెంకటేశ్వరగార్డెన్ సమీపంలో చోటు చేసుకుంది. ఆదివారం ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన రహీమ్ బైక్ మీద హోటల్‌కు వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని దాదాపు 50 మీటర్ల దూరం లాక్కెళ్లింది. దీంతో అతని శరీరం చిద్రమై ప్రాణాలు కోల్పోయాడు. ఎస్సై సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతిడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ఆలయ సమీపంలో మహిళ మృతి

పాపన్నపేట, ఫిబ్రవరి 9 : మానసిక పరిస్థితి సరిగా లేక అనారోగ్యంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఏడుపాయల ఆలయ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా అడవిదేవునిపల్లికి చెందిన లక్ష్మి కోటేశ్వరీ మానసిక పరిస్థితి సరిగా లేక తీర్థయాత్రలకు తిరుగుతూ ఉంటుండేది. 15 రోజుల కింద మాఘ అమావాస్య సందర్భంగా ఏడుపాయల ఆలయం వద్దకు వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి సమయంలో ఆలయ సమీపంలో మృతి చెందింది. అటుగా వెళ్తుతున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ దవాఖానకు తరలించారు. ఆదివా రం మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# వృథాగా బోరు నీరు



నర్సాపూర్ మున్సిపల్ 6వ వార్డులో రోడ్డుపై వృథాగా పారుతున్న నీరు

నర్సాపూర్, ఫిబ్రవరి 9 : నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులోని శివాలయం వద్ద బోరు నీరు వృథాగా పోతున్నది. వారం రోజుల నుంచి పైప్‌లైన్ పగిలి పోయి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. నీరు వృథాగా పోవడంతో ఇండ్లలోకి నీరురాక నీటి సమస్య తలెత్తుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అడ్డుకొని నీటి సమస్యను తీర్చాలని కోరారు.

# కారుబోల్తా.. నలుగురికి గాయాలు



రామాయంపేట బైపాస్‌లో బోల్తా పడిన కారు

రామాయంపేట, ఫిబ్రవరి 9 : కారు బోల్తా పడిన సంఘటన రామాయంపేట పట్టణంలోని జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రామాయంపేట పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్ మీదుగా కుంభమేళాకు వెళ్తున్న ఓ కుటుంబం మార్గమధ్యంలోని రామాయంపేట బైపాస్ వద్ద బైక్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్సులో స్థానికులు రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని బొల్తా పడ్డ కారును జేసీబీ సాయంతో పైకి తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# తగ్గుతున్న భూగర్భ జలమట్టం..

- మెదక్ జిల్లాలో పడిపోతున్న భూగర్భ జలాలు
- నెల వ్యవధిలోనే మీటరు మేర పడిపోయిన నీరు
- అత్యధికంగా వరి సాగు, పెరుగుతున్న ఎండలే కారణం
- మెదక్ జిల్లాలో 2.45 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఎండల తీవ్రత.. పంటలపై ప్రభావం



చిలిపిచెడ్ మండలం చండూర్‌లో వ్యవసాయ పొలం వద్ద తగ్గిన బోరు నీరు

మెదక్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. రోజు రోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతుండడం ఆందోళనలకు గురి చేస్తోంది. దీంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. డిసెంబర్‌లో సాధారణ నీటి మట్టం 9.95 మీటర్లు కాగా, జనవరి నెలలో 10.94 మీటర్లకు పడిపోయింది. అంటే భూగర్భ జలాలు దాదాపు 0.99 మీటర్ల లోతుల్లోకి వెళ్లింది. అయితే ఈ సారి వర్షకాలంలో సాధారణ వర్షపాతమే నమోదైంది. ఒకేసారి దంచికొట్టిన వానలతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండాయి. ఆ తర్వాత వర్షాలు కురవలేదు. జిల్లాలో చాలా చెరువులు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం ప్రమాదకర స్థాయికి చేరింది. ఇప్పటికే మెదక్, నర్సాపూర్, తూప్రాన్ డివిజన్‌ల్లో మోటరు బోర్లు ఎత్తిపోతుండగా నీటి బావులు ఎండిపోతున్నాయి. దీంతో బోరు బావుల కింద వేసిన పంటల పొలాలు నీరు లేక బీటలు వారుతున్నాయి. జిల్లాలో మారుమూల గ్రామాలు, తండాల్లో తాగునీటి సమస్య ఎదురవుతోంది. రోజు రోజుకూ ఎండలు ముదరడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోనూ నీరు తగ్గుముఖం పడుతోంది. జిల్లాలో అధిక మొత్తంలో వరి సాగు చేయడంతో నీటి వాడకం అధికం కావడం వల్ల భూగర్భ జలాలు సైతం తగ్గుముఖం పట్టాయి. నెల వ్యవధిలోనే జిల్లాలో సరాసరిగా ఒక్క మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. నీటి వాడకం ఇదే విధంగా కొనసాగితే మార్చి, ఏప్రిల్, మే నెలలో భూగర్భ జలాలు మరింత పడిపోయే అవకాశం ఉంటుందని, దీంతో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతాయని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### నెల వ్యవధిలోనే ఒక్క మీటర్లకు పడిపోయిన జలాలు..

జిల్లాలో నెల వ్యవధిలోనే ఒక్క మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. డిసెంబర్‌లో 9.95 మీటర్లు ఉండగా, జనవరిలో 10.94 మీటర్లకు పడిపోయింది. అంటే సుమారు ఒక్క మీటర్ లోతులోకి జలాలు పడిపోయాయి. ఇదిలావుండగా 2023 నవంబర్ నెలలో 9.21 మీటర్లు ఉండగా, 2025 జనవరి నెలలో 10.94 మీటర్లకు పడిపోగా, -1.73 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. అయితే 5 నుంచి 10 మీటర్ల లోతులో భూగర్భ జలాలు పడిపోయిన 7 మండలాలు హవేళీఘనపూర్, మనోహరాబాద్, మెదక్, పాపన్నపేట, శివ్వంపేట్, టేక్మాల్, తూప్రాన్‌లు కాగా, 10 నుంచి 20 మీటర్ల లోతులో 13 మండలాలు అల్లాదుర్గం, చేగుంట, చిలిపిచెడ్, కొల్చారం, కౌడిపల్లి, మా సాయిపేట్, నర్సాపూర్, నిజాంపేట్, రామాయంపేట, రే గోడ్, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, వెల్దుర్తి మండలాలు ఉన్నాయి. 20 మీటర్ల లోతులో నార్సింగి మం డలం ఉంది.

### మెదక్ జిల్లాలో 2.45 లక్షల ఎకరాల్లో వరి సాగు..

జిల్లాలో ఈ రబీ సీజన్‌లో సుమారు 2.45 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. మక్క 2196 ఎకరాలు, జొన్న 3908 ఎకరాలు, శనగలు 143 ఎకరాలు, ఇంతర పంటలు 790 ఎకరాలు మొత్తంగా జిల్లాలో 2.53 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. వరి పంటను ఎక్కువగా సాగు చేయడంతోనే భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్నట్లు సంబంధితశాఖ అధికారులు భావిస్తున్నారు. దీనికి తోడు రోజురోజుకూ ఎండలు ముదురుతుండడంతో పాతాలగంగ లోపలికి అమాంతంగా పడిపోతోంది. యాసంగి సీజన్‌లో వరితో పాటు ఇతర పంటలను కూడా అధిక మొత్తంలో సాగు చేశారు. దీంతో నీటి వినియోగం కూడా ఎక్కువగానే పెరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో అధిక మొత్తంలో వరి సాగవటంతోనే భూగర్భజలాలు తగ్గుముఖం పడుతున్నట్లు సంబంధిత శాఖ అధికారులు వాపోతున్నారు. పంటల సాగుకే కాకుండా ఇతరేతర అవసరాలకు నీటి వినియోగం పెరిగింది. ఎండలు పెరుగుతుండడంతో నీటి వాడకం మరింత పెరుగుతోంది. నీటిని ఇదే విధం గా వాడినట్లయితే మార్చిలో భూగర్భజలాలు మరింత లోతులోకి పడిపోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో తాగు నీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుందని భూగర్భ జలాల నిపుణులు చెబుతున్నారు. కావున నీటిని అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలని కోరుతున్నారు.



మెదక్ మండలం మక్తభూపతిపూర్ శివారులో..

### ఎండల తీవ్రత.. పంటలపై ప్రభావం

జిల్లాలో పగటిపూట ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగాయి. గత వారం రోజుల నుంచి జిల్లాలో 37 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జలాలు సైతం అమాంతంగా పడిపోతున్నాయి. ముఖ్యంగా మెదక్, నర్సాపూర్ డివిజన్లలో భూగర్భ జలాలు తీవ్రస్థాయిలో అడుగంటుతున్నాయి. ఫిబ్రవరి నెలలో గతంలో ఎన్నడూ లేనంతగా ఒక్కసారిగా ఎండలు ముదరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రత యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం చూపనున్నది. ఇప్పటికే ఎండలతో పంటలకు ఎంత నీరు అందించినా వెంట వెంటనే ఆరిపోతూనే ఉంది. భూగర్భజలాలు పడిపోతుండడంతో మోటరు బోర్లు ఎత్తిపోతున్నాయి. రెండు ఇంచులు పోసే మోటరు బోరు ప్రస్తుతం ఆఫ్ ఇంచ్‌లో పోస్తున్నాయి. మరికొన్ని చోట్ల చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి. ఎండలు మరింత ముదిరితే భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయి, బోర్లు ఎత్తిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ యాసంగిలో వరి పంటలు పండడం కష్టమేనని రైతులు వాపోతున్నారు.

### ఎండలు ముదరడంతో భూగర్భ జలాలపై ప్రభావం

ఫిబ్రవరి నెలలోనే ఎండలు ముందరడంతో భూగర్భ జలాలపై ప్రభావం పడుతోంది. డిసెంబర్ నెల నుంచి జనవరి నెల వరకు సుమారు ఒక్క మీటరు లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. వరి విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో సాగుకు నీటి వినియోగం ఎక్కువగా అవుతుంది. జిల్లాలో భూగర్భజలాలు నెల వ్యవధిలో చాలానే అడుగంటాయి. భూగర్భ జలాల విషయంలో ప్రస్తుతం ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదు.

-లావణ్య, అసిస్టెంట్ హైడ్రాజలిస్ట్, మెదక్

# రామాయంపేటలో ఖేలో సైక్లింగ్ డ్రైవ్..

రామాయంపేట, ఫిబ్రవరి 9 : రామాయంపేట పట్టణంలోని సైక్లింగ్ డ్రైవ్‌ను జాతీయ సైక్లింగ్ కోచ్ దండు యాదగిరి, బసన్నపల్లి మల్లేశం ప్రారంభించారు. ఆదివారం రామాయంపేట పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సైక్లింగ్ డ్రైవ్‌ను ప్రారంభించి మాట్లాడారు. 10 ఏండ్ల విద్యార్థుల నుంచి 60 ఏండ్ల వయస్సు వారు కూడా ఈ సైక్లింగ్ రేస్ పాల్గొన వచ్చున్నారు. ప్రతి ఆదివారం ఖేలో ఇండియా ద్వారా ప్రతి ఒక్కరికి సైక్లింగ్‌లో ప్రతిభను చాటేలా శిక్షణను ఇస్తామన్నారు.



సైక్లింగ్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కోచ్ దండు యాదగిరి

# మహిళల స్వావలంబనే లక్ష్యం

## హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ హిమజ

శివ్వంపేట, ఫిబ్రవరి 9 : మహిళల సాధికారత, స్వావలంబనే లక్ష్యంగా తమ స్వచ్ఛం ద సంస్థ పని చేస్తుందని హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ హిమజ అన్నారు. ఆదివారం శివ్వంపేట మండలం దొంతిలో బేతని సంరక్షణ హోమ్‌లో ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న బాధిత మహిళల కోసం ఉచిత టైలరింగ్, జూట్ బాగ్ మేకింగ్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణ అనంతరం అర్హులకు ఉచితంగా కుట్టుమిషన్లు అందించనుందని తెలిపారు. కార్యక్రమం లో ఫాదర్ జోసెఫ్, రాబిన్, కర్నెన్, వీరబాబు, విన్సెంట్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు మల్లీశ్వరి, వీరేశ్ తదితరులు ఉన్నారు.



కుట్టుమిషన్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఫౌండర్ డాక్టర్ హిమజ